పంట కాలువలు కనుమరుగు

- గట్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు
- గృహవాసాలు పెరగడంతో మురుగు నీరు ప్రవాహం
- లేఅవుట్లు పెరిగిపోవడంతో వ్యవసాయం తగ్గుముఖం
- పట్టించుకోని రెవెన్యూ, వ్యవసాయ అధికారులు

ఏలూరు రూరల్ : 'మా కుటుంబానికి చెందిన రెండు ఎకరాల భూమిలో 10 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నాను. కొంతకాలంగా సాగు చేద్దామంటే కాలవల నుంచి నీరు సక్రమంగా పారడం లేదు. అరకొరగా ప్రవహిస్తున్న నీటితో నారు పోసినా, పంటకు సరిపడా నీరు అందుతుందన్న ధీమా లేదు. దీనికి కారణం పంట కాలువల ఆక్రమణలే. దీనిపై ఎవరిని ప్రశ్నించాలి. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఆక్రమణలపై దృష్టి సారించరు. ఇక చేసేది లేక పంటల సాగును విరమించుకున్నాను'.. ఇదీ వెంకటాపురం రైతు కంపా సత్యనారాయణ ఆవేదన.

డ్రెయినేజీలుగా మారిన పంట కాలువలు

ఏలూరు నగర పరిసర ప్రాంతాలైన వెంకటాపురం, పోణంగి, తంగెళ్లమూడి, సత్రంపాడు, శనివారపుపేట, కొమడవోలు చేలకు సాగునీరు అందించే పంట కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. పరిసర పంట భూములు లే–అవుట్లుగా మారడంతో పాటు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాలువను సైతం ఆక్రమించి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. ప్రజలు గృహాలు నిర్మించుకోవడంతో కాలువలు ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో విశాలమైన కాలువలు సైతం పిల్లకాలువగా మారిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పంట కాలువలే డ్రెయినేజీ వ్యవస్థగా రూపాంతరం చెందాయి.

యథేచ్ఛగా కాలువల ఆక్రమణ

ఎన్నో ఏళ్ల క్రితం ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులు ఏలూరు కృష్ణ కెనాల్ నుంచి పరిసర గ్రామాల చేలకు సాగునీరు అందించేందుకు విశాలమైన కాలువులు తవ్వించారు. కెనాల్ వద్ద స్లూయిజ్‌లు నిర్మించారు. వీటి పరివేక్షణ కోసం లస్కర్లను నియమించారు. స్థానిక పడమట లాకులకు ఎగువన నిర్మించిన స్లూయిజ్‌కు ఇరువైపుల హనుమాన్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, సుందరయ్య కాలనీ ఏర్పడి, గట్టు ఆక్రమణకు గురై కాలువ కుచించుకుపోతోంది. దీంతో దిగువన కొత్తూరు ఇందిరమ్మ కాలనీ, బూరాయిగూడెం పరిసర చేలకు సకాలంలో నీరు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంపులచెరువు, పడమట లాకుల మధ్య ఏర్పాటుచేసిన మరో స్లూయిజ్ గుండా సాగిన కాలువ మురికికూపంగా మారింది.



ఆక్రమణకు గురైన జాలిపూడి కాలువ గట్టు



కుచించుకుపోతున్న జాలిపూడి కాలువ



వెంకటాపురంలో ఆక్రమణకు గురైన కాలువ

పంటలకు అందని సాగునీరు

దీనివల్ల వంగాయగూడెం మీదగా మరడాని రంగారావు, వైఎస్ఆర్ కాలనీ పరిసర పంట చేలకు సాగునీరు అందడం లేదు. ఈ ప్రాంతాల్లో వ్యవసాయం దాదాపుగా కనుమరుగవుతోంది. పాండురంగా థియేటర్ వద్ద నిర్మించిన స్లూయిజ్ నుంచి సత్యనారాయణపేట మీదుగా బ్రహ్మంగారి గుడి వరకూ సాగే జాలిపూడి కాలువ సైతం ఆక్రమణకు గురయ్యింది. అక్కడ నుంచి మాదేపల్లి వరకూ చెరువు వరకూ కాలువ గట్టుపై పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. మరోపక్క సుంకరవారితోట నుంచి పారే కాలువ సైతం నివాసాల మధ్య కుచించుకుపోయింది. బావిశెట్టివారి పేట వద్ద ఏర్పాటు చేసిన స్లూయిజ్ నుంచి కిందకు పారే కాలువ ఆక్రమణకు గురై మురుగుకాలువగా మారిపోయింది. ఫలితంగా సాగునీరు సక్రమంగా పారక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయంపై ఆసక్తి చూపడం లేదు.

పంట భూముల్లో రియలర్ల పాగా

రియల్టర్లు పంట భూములు కొనుగోలు చేసి లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. ఇటు కృష్ణ, అటు గోదావరి నుంచి పుష్కలంగా నీరు పారే అవకాశం ఉన్నప్పటికీ పలు గ్రామాల్లో వ్యవసాయం తగ్గుముఖం పడుతోంది. గతంలో ఏలూరు పరిసర గ్రామాల్లో సుమారు 10వేల ఎకరాల్లో వ్యవసాయం సాగేది. ఇప్పుడు కేవలం 5 నుంచి 6 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో పాటు కాలువ ఆక్రమణలు కూడా తోడు కావడంతో వ్యవసాయ భూములు తగ్గిపోతున్నాయి.

పంట కాలువల్లో మురుగునీరు

ఏలూరు పరిసరాల్లో పంట కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. విశాలమైన కాలువలు ఇప్పుడు డ్రెయినేజీగా మారిపోతున్నాయి. ఏటా పంట కాలువలో మురుగునీరే పారుతోంది. ఆ నీటితోనే సాగు చేస్తున్నాం. 10 ఏళ్ల క్రితం వరకూ కాలువలో సాగుకు అనుకూలమైన నీరు పారేది. ఇప్పుడు నల్లగా నురగతో కూడిన కలుషిత నీళ్లు వస్తున్నాయి. అధికారులు పంట కాలువ, డ్రెయినేజీలను వేరు చేయాలి.
– శేషయ్య, బాబూఖాన్‌గూడెం

జాలిపూడి కాలువ ప్రక్షాళన చేయాలి

పాండురంగా థియోటర్ నుంచి మాదేపల్లి వరకూ జాలిపూడి కాలువ ఆక్రమణకు గురైంది. కాలువ రెండు వైపులా ఇళ్లు, దుకాణాలు నిర్మించారు. కాలం గడిచే కొద్దీ ఈ కాలువ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు ప్రొక్లెయిన్‌తో కాలువ మట్టి తీసి వదిలేస్తున్నారు. ఆక్రమణలు పట్టించుకోవడం లేదు.
– సత్యనారాయణ, వెంకటాపురం

క్లుప్తంగా

వైభవంగా లక్ష బిల్వార్చన



గుండుగొలను శివాలయంలో లక్ష బిల్వార్చన

భీమడోలు: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా చివరి ఆదివారం శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. గుండుగొలను, పూళ్ల, భీమడోలు, అంబర్‌పేట, పోలసానిపల్లిలో స్వయంభువుగా వెలిసిన స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత నవరస ఫలాభిషేక, లక్ష బిల్వార్చన పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు దివ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో పూజారుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు.

కొవ్వలిలో సెమీక్రిస్మస్ వేడుకలు

దెందులూరు: కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోర్ ఆఫీసర్ మేజర్ కె.సుబ్బారావు, కె.మేరికుమారి ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కొవ్వలితో పాటు సమీప గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. క్రిస్మస్ కేక్‌ను డివిజనల్ కమాండర్ కె.మోషే, జి.మేరికుమారి కట్ చేశారు. కోర్ ఆఫీసర్ కుమార్తె గానం చేసిన సెమీక్రిస్మస్ గీతాల డిస్క్‌ను వారు విడుదల చేశారు. వేడుకల్లో సంఘ సభ్యులు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన విశ్వాసులు, పూర్వ సమితి సభ్యులు, సంఘస్తులు, చిన్నారుల సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

దెందులూరు: ఫొటోగ్రాఫర్లు వినియోగదారులకు నాణ్యమైన, ఉత్తమ సేవలు అందించి గుర్తింపు పొందాలని ఏలూరు ఫోటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మెగా దుర్గారావు అన్నారు. ఆదివారం గోపన్నపాలెంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి యూనియన్ కార్యవర్గం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

పీఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి (78) శనివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. సుబ్బారెడ్డి మృతి పట్ల ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కళాకారులు పి ఆదిశేషు సంతాపం తెలియజేశారు. సుబ్బారెడ్డి మృతి కళా సాంస్కృతిక రంగానికి తీరని లోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా నదిలో ఈతకు వెళ్లిన ఆయన నదిలో ఉండగానే గుండెపోటుకు గురయ్యారని సహచరులు గమనించి మణిపాల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు పరీక్షించిన వైద్యులు తెలిపారన్నారు. ఆయనకు భార్య శివలీల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాటక రచయిత, దర్శకుడు, నటుడు సుబ్బారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రజానాట్యమండలిలో 40 ఏళ్ల ప్రయాణంలో 200 మంది కళాకారులను సీపీఎం సభ్యులుగా తీర్చిదిద్దారన్నారు. సుబ్బారెడ్డి మృతి సాంస్కృతిక రంగానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని ఆదిశేష తెలిపారు.

నాణ్యతాప్రమాణాలతో ఆహారం తయారీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రముఖ ఫుడ్ చైన్ వ్యాపార సంస్థ ప్యారడైస్ హోటల్‌లో కృత్రిమ రంగులు కలుపుతున్నట్లు వచ్చిన వార్తలను ఆ సంస్థ కేంద్ర కార్యాలయం బాధ్యులు ఖండించారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు ఏలూరులో ఓ ప్రకటన విడుదల చేశారు. తమ సంస్థ ఎప్పుడూ అనుమతించలేని పరిమితుల్లో ఎప్పుడూ కృత్రిమ రంగులు వినియోగించదని వారు పేర్కొన్నారు. తెలిపారు. నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ, వినియోగదారుల ఆరోగ్య భద్రతకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫుడ్ ఆడిటర్ల తనిఖీ సందర్భంగా తమ సంస్థకు సంబంధించి గుర్తింపును, ప్రమాణాల ధ్రువపత్రాలను నిరూపించిందని తెలిపారు. తమ బ్రాండ్ వినియోగించే ఆహార రంగులు సహజంగా లభించే ముడి పదార్థాల నుంచి తీసుకున్నట్లు తెలిపారు. అవి కృత్రిమ రుచులను కలిగి ఉండవని ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఈఓ గౌతమ్ గుప్తా మాట్లాడుతూ తమ వ్యాపారంలో నాణ్యత, పరిశుభ్రత, భద్రత ప్రధానమైనవని ఇటీవల వచ్చిన ఆరోపణను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వినియోగదారుడే ప్రథమ ప్రాధాన్యత అని నిశితంగా పరీక్షించిన అనంతరం ఆహార పదార్థాలను వడ్డిస్తామని స్పష్టం చేశారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

దెందులూరు: కొవ్వలి, దోసపాడు, పోతునూరు గ్రామాల్లో ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ ఆదివారం పర్యటించారు. తుఫాన్ నేపథ్యంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వెంటనే ధాన్యం మిల్లులకు తరలించాలని తరలించకపోతే నష్టం వాటిల్లుతుందని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు, గోనె సంచుల సరఫరాలో ఇబ్బందులుంటే తెలియజేయాలని రైతులను కోరారు. రైస్ మిల్లులకు వెళ్లి రికార్డులు పరిశీలించారు. మిల్లర్లకు పలు సూచనలు చేశారు. ఆర్డీఓ వెంట దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలని, వీఆర్వోలు రామకృష్ణ, రామచంద్రరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగార్చన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రంలో కార్తీక మాస ముగింపు సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాత్రి క్షేత్రం ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పత్తేబాదలో భారీ అన్న సమారాధన

స్థానిక పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్తీక మాసోత్సవాల ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధనలో సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొన్నారు.



జ్యోతిర్లింగార్చనలో పాల్గొన్న పాల్గొన్న భక్తులు

ఉత్సాహంగా బ్రాహ్మణ ఐకాస కార్తీక వనసమారాధన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు బ్రాహ్మణ ఐకాస ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దొండపాడులోని అద్దంకి రాంబాబు తోటలో నిర్వహించిన వనసమారాధన కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత పార్థివ లింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ బ్రాహ్మణుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా చంటి దంపతులను ఐకాస నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్నారులు, యువకులు ఆటపాటలతో మెప్పించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన భగవద్గీత పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరి రవి, శ్రీశ్రీ శర్మ, శ్రీహరి రావు, బొద్దనపల్లి సుబ్రహ్మణ్యం, సత్యవాడ దుర్గా ప్రసాద్, కొపెతల్ల తాయారు, తోలేటి శ్రీనివాస్, నుదురుపాటి కృష్ణ చైతన్య, తురగా రామకృష్ణ, చాట్రాతి మదన్, భోగరాజు ప్రసాద్ పాల్గొన్నారు.



ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని సత్కరిస్తున్న బ్రాహ్మణ ఐకాస నాయకులు

సమాజ సేవలతో జన్మ ధన్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి మనిషి దేవుని భక్తిలో నీతిగా జీవిస్తూ, సమాజ సేవ చేసి తమ జన్మ ధన్యం చేసుకోవాలని స్థానిక అమలోద్భవి కెథీడ్రల్ విచారణ గురువు ఫాదర్ ఇంజమూల మైఖేల్ అన్నారు. ఆదివారం స్థానిక అమలోద్భవి కెథీడ్రల్‌లో ఫాదర్ మైఖేల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పేదలకు, వృద్ధ మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఏలూరు పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ఎబినేజర్ శాస్త్రి, ఎం. జోయతిరాజు, ఫాదర్ విద్యాసాగర్, డీ. అబ్రహం, జే. బెనర్జీ, ఎస్. థామస్, టీ. రామారావు పాల్గొన్నారు.



వృద్ధ మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఫాదర్ మైఖేల్

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గణపవరం: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గణపవరం మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యతిరేక ప్రదర్శన, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు.అనంతరం ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి శివశ్రీనివాసరావు, సభ్యులు అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

హెచ్ఐవీ అంటువ్యాధి కాదు

దెందులూరు: హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ఆదివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా హెచ్ఐవీ మృతులకు నివాళులర్పించారు. హెచ్ఐవీ ఆకారాన్ని ప్రతిబింబిస్తూ అవగాహన ప్రదర్శన నిర్వహించారు.



గణపవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ రష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఐసీటీసీ కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థినులు ప్లకార్డులతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ సీహెచ్ సింహాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ కవిత, అప్పారావు, సిబ్బంది స్వర్ణ, పరదేశి, రక్త నిల్వ సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ నమోదులో విద్యార్థులకు ఇక్కట్లు

భీమడోలు: అపార్ ఐడీ నమోదు విద్యార్థుల పాలిట శాపంగా మారింది. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుల్లోని చిన్నపాటి తప్పులు కారణంగా విద్యార్థులు ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్లితే... భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో భీమడోలు శివారు సూర్యారావుపేటకు చెందిన నోకిరెడ్డి నాగేంద్ర బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 8న నిర్వహించనున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో ఆ విద్యార్థి ఆధార్, పదో తరగతి, ఇంటర్ ధ్రువీకరణ పత్రాలను డిగ్రీ కళాశాల యాజమాన్యానికి అందజేసారు. సెమిస్టర్ పరీక్షలకు కళాశాల యాజమాన్యం విద్యార్థి పరీక్ష ఫీజు చెల్లించాడు. పరీక్షల నేపథ్యంలో దరఖాస్తులను అందించే క్రమంలో అతని పదో, ఇంటర్ సర్టిఫికెట్లలో ఇంటి పేరు నూకిరెడ్డిగా నమోదైంది. ఆధార్ కార్డులో నోకిరెడ్డి అని ఉంది. వేర్వేరుగా వివరాలుండడంతో అతని దరఖాస్తును యూనివర్సిటీ వారు తిరస్కరించారు. దీనితో అతను సెమిస్టర్ పరీక్షలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. అదే కళాశాల డిగ్రీ బీఏ చదువుకుంటున్న కె.మంజూశ్రీ జనన ధ్రువీకరణ పత్రంలో వయస్సు తప్పుగా నమోదు కావడంతో సరి దిద్దుకునేందుకు అవస్థలు పడుతోంది. ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్, సర్టిఫికెట్లు, జననధ్రువీకరణ పత్రాల్లో లోపాల వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సారి పరీక్షలకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు.

పుస్తక పఠనంతో బంగారు భవిష్యత్తు

భీమడోలు: విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలులో బాలబాలికలతో మండే సుధాకర్, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథపాకులు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే ప్రగతి



భీమడోలులో మహిళలకు శిక్షణ అందించిన అనూషను సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

భీమడోలు: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారా కుటుంబాలు బలోపేతమై ప్రగతి సాధిస్తాయని ఏలూరు జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు శశిశేఖర్‌రావు అన్నారు. భీమడోలు సత్యసాయి సేవా సమితి, హైదరాబాద్ గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 82 మంది యువతులకు 37 రోజుల పాటు మగ్గం, జర్దోసిలో శిక్షణ అందించారు. శిక్షణ ముగింపు సందర్భంగా వారికి ధ్రువీకరణ పత్రాలు, బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఆదివారం భీమడోలు అమ్మవార్ల ఆలయాల ప్రాంగణం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కన్వీనర్ వర్ధనేడి సత్యసాయి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సత్యసాయి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కె.శశిశేఖరరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం చాలా సంతోషదాయమన్నారు. సామాజిక కార్యక్రమాలను చేపడుతూ మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న సత్యసాయి సేవా సంస్థల సేవలను కొనియాడారు. శిక్షణలో నేర్చుకుని మెలకువలను, పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని స్వయం ఉపాధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. స్వయం ఉపాధి కార్యక్రమాలకు బ్యాంకర్లు తమ వంతు రుణ సహాయం అందిస్తారని పేర్కొన్నారు. ఫ్యాకల్టీ అనూష సేవలను అభినందించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి తనూజ, సబ్ జోన్ కన్వీనర్ సత్యనారాయణ, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు మేనేజర్లు, సేవా సమితి ప్రతినిధులు యలమర్తి సత్తిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	18
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	28
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	80
పచ్చిమిర్చి	24–30	బీట్‌రూట్	60
కాకర కాయలు	28–34	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70
క్యాబేజీ	32–36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	60	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36–58	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24–28	బఠాణి	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40